జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
మంగళవారం 10 నవంబర్ 2026 పేజీలు:10



జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

- జిల్లా సహాయ కార్యదర్శి వర్ధశీ సైదుల

నాగర్ కర్నూల్ నవంబర్ 9 (ప్రజా జ్యోతి బ్యూరో)

అఖిలభారత కిసాన్ సభ ఏఐకేఎస్ జాతీయ 36వ మహాసభలను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వర్ధశీ సైదులు పిలుపునిచ్చారు సోమవారం మండల కేంద్రంలో సింగారం గ్రామంలో రైతు నాయకులతో కరపత్రాలను విడుదల చేశారు. - మిగతా 2 లో



రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి వాకిటి శ్రీహరి

- మఖ్తల్ నుంచి కొడంగల్ రైతు మేళాకు భారీగా తరలిన రైతులు
- జెండా ఊపి రైతు మేళాకు బస్సులను ప్రారంభించిన మంత్రి

మఖ్తల్

నియోజకవర్గ ప్రతినిధి,నవంబర్ 09 (ప్రజా జ్యోతి): రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని చాటిచెప్పేలా కొడంగల్‌లో ఈరోజు సాయంత్రం నిర్వహిస్తున్న మెగా రైతు మేళాకు మఖ్తల్ నియోజకవర్గం నుంచి రైతులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. రైతుల ప్రయోజనాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తూ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు బయలుదేరిన రైతుల బస్సులను లింగంపల్లి గ్రామం నుంచి రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి జెండా ఊపి ప్రారంభించారు. - మిగతా 2 లో

ప్రజావాణి వినతులను చట్టప్రకారం పరిష్కరించాలి

- జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ పాటిల్



నాగర్ కర్నూల్ : నవంబర్ 09 (ప్రజా జ్యోతి)

ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా ఎస్పీ కార్యా లయంలో ప్రతివారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు దారుల నుండి 04 ఫిర్యాదులను జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ స్వీకరించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల సమస్యలను పరిశీలించి చట్టప్రకారం పరిష్కరించాలని సంబందిత అధికారులకు సూచించారు. - మిగతా 2 లో



గ్రామాల బాట పట్టాల్సిందే..

సమస్యల పరిష్కారానికి అధికారులే బాధ్యత వహించాలి!

2 లో

- ప్రజావాణి ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు!
- 58 వినతుల స్వీకరణ.. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి సకాలంలో పరిష్కరించాలి– మండల ప్రత్యేక అధికారులకు కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశాలు

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి వాకిటి శ్రీహరి

మొదటిపేజీ తరువాయి





ఈ సందర్భంగా మంత్రి రైతులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని పేర్కొన్నారు. రైతులకు అండగా నిలవడం, వారి కష్టాలను తగ్గించడం, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రైతుల సమస్యలను పరిష్కరించడంతో పాటు సాగుకు అవసరమైన వసతులు, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని భావిస్తున్న ప్రజా ప్రభుత్వం రైతుల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. మెగా రైతు మేళా ద్వారా రైతులకు వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన మార్పులు, ఆధునిక సాగు విధానాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కలుగుతుందని తెలిపారు.రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు మద్దతుగా మక్తల్ నియోజకవర్గం నుంచి రైతులు పెద్దఎత్తున తరలిరావడం పట్ల మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మక్తల్ మండల అధ్యక్షులు ఈడ్గి శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస హనుమంతు,జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు కలాల్ రాజేందర్ గౌడ్,మాగనూరు మండల అధ్యక్షులు శివరాం రెడ్డి, గొల్లపల్లి గ్రామ సర్పంచ్ సూర్య కుమార్, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలచందర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, చెన్నయ్య గౌడ్, వాకిటి శ్యామ్, కల్లూరి గోవర్ధన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, వివిధ గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామాల బాట పట్టాల్సిందే.. సమస్యల పరిష్కారానికి అధికారులే బాధ్యత వహించాలి!

మొదటిపేజీ తరువాయి

మహబూబ్‌నగర్, నవంబర్ 09 (ప్రజా జ్యోతి బ్యూరో): ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా, ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు. సోమవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి మొత్తం 58 వినతులను ఆమె స్వీకరించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూధన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియతో కలిసి అర్జీదారుల సమస్యలను స్వయంగా విన్నారు. ప్రతి దరఖాస్తులోని అంశాలను పూర్తిగా అర్థం చేసుకుని, నిబంధనల ప్రకారం బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, నీటిపారుదల, వ్యవసాయం, సంక్షేమం, పౌరసరఫరాలు, భూ సర్వే, గృహ నిర్మాణం, పోలీసు, విద్య, వైద్య ఆరోగ్యం, విద్యుత్ తదితర శాఖలకు సంబంధించిన ఫిర్యాదులు ప్రజావాణిలో అందాయి.

గ్రామాల్లో పర్యటించకపోతే పర్యవేక్షణ ఎలా.?

ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మండల ప్రత్యేక అధికారుల క్షేత్రస్థాయి పర్యటనలపై కలెక్టర్ సమీక్షించారు. ప్రతి మండల ప్రత్యేక అధికారి వారంలో ఒకరోజు తప్పనిసరిగా గ్రామాల్లో పర్యటించి అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, గ్రామపంచాయతీలను తనిఖీ చేయాలని ఆదేశించారు.పర్యటనల్లో గుర్తించిన సమస్యలను సంబంధిత జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి బాధ్యతాయుతంగా కృషి చేయాలని సూచించారు. పర్యటన వివరాలను పర్యటన దినచర్యలో నమోదు చేసి కలెక్టరేట్ పరిపాలనాధికారికి సమర్పించాలని, ఫొటోలు, వివరాలను ప్రతి వారం ప్రత్యేక అధికారుల వాట్సాప్ సమూహంలో పంపించాలని ఆదేశించారు. ముఖ్యంగా పాఠశాలల్లో పారిశుద్ధ్యం, ప్రహరీ గోడలు, ఆటస్థలాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

ఎల్‌నినో ప్రభావం.. నీరు, విద్యుత్ పొదుపుపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా నీరు, విద్యుత్ పొదుపుపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ సూచించారు. గ్రామాల్లో నీటి లీకేజీలు, వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలు, విద్యుత్ వృథాను పరి శీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. మహబూబ్‌నగర్ నగరపాలక సంస్థ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో పగటిపూట కూడా వీధి దీపాలు వెలుగుతున్నాయన్న ఫిర్యాదులపై స్పందించారు. ఆటోమేటిక్ స్విచ్‌లు పనిచేయకపోతే మాన్యువల్ పద్ధతిలోనైనా వీధి దీపాల నిర్వహణ చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్‌కు సూచించారు.



అవసరమైన పనులకే ఉపాధి హామీ నిధులు

ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో చేపట్టే పనులను స్థానిక అవసరాలకు అనుగుణంగా ఎంపిక చేయాలని కలెక్టర్ సూచించారు. భూగర్భ జలాలు సమృద్ధిగా ఉన్న ప్రాంతాల్లో నీటి సంరక్షణ పనులకు బదులుగా మొక్కల పెంపకం, రహదారుల మరమ్మతులు వంటి అవసరమైన పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీలో చేపట్టాల్సిన పనుల జాబితాను పరిశీలించి, పనుల వివరాలను తనకు అందజేయాలని ఆదేశించారు.

పాఠశాలలకు త్రీఫేజ్ విద్యుత్‌పై ప్రతిపాదనలు

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ఏకదశ విద్యుత్ సరఫరా కారణంగా నీటి మోటార్లు దెబ్బతింటున్న సమస్యను గుర్తిస్తే, అవసరమైన చోట త్రిదశ విద్యుత్ సరఫరా కల్పించేందుకు ప్రతిపాదనలు సమర్పించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.అలాగే ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న విత్తనాల పంపిణీపై రైతులకు విస్తృత ప్రచారం కల్పించి, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా పంపిణీ చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి, ఇన్‌చార్జి జిల్లా పంచాయతీ అధికారి వెంకట్‌రెడ్డి, భూసేకరణ ప్రత్యేక ఉప కలెక్టర్ యాదగిరి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా ఆయన వర్ధ0 సైదులు మాట్లాడుతూ.. అఖిల భారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభలు పోరాటాల పురిటి గడ్డ నల్లగొండ జిల్లాలో ఈనెల 15 నుండి 18 వరకు జరుగుతున్నాయని ఈ మహాసభలో దేశంలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను చర్చిస్తామని నరేంద్ర మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలు కార్పొరేట్ శక్తుల కు అనుకూలంగా వ్యవహరించే తీరు పై భవిష్యత్తు పోరాటాలకు రూపకల్పన చేస్తామని అన్నారు ఈ మహాసభలకు జిల్లా రైతాంగం అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో సిఐటియు టౌన్ కార్యదర్శి రాములు గారు రైతు సంఘం నాయకులు పర్వతాలు గారు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మల్లేశు రైతు సంఘం నాయకులు వెంకటయ్య అంతయ్య ఆంజనేయులు బుచ్చయ్య పర్వతాలు రవి గోపాల్ బుచ్చ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి వినతులను చట్టప్రకారం పరిష్కరించాలి

మొదటిపేజీ తరువాయి



జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదులలో భూమికి సంబంధించిన అర్జీలు 01,తగు న్యాయం సంబంధించిన అర్జీలు 02, కుటుంబ గొడవకు సంబందించి 01 వచ్చిందని పి.ఆర్.ఓ తెలిపారు.ప్రజలు నిర్భయంగా,మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీస్ సేవలను వినియోగించుకో వాలన్నారు.ప్రజా సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేలా,పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతిభద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా పోలీస్ శాఖ పనిచేస్తుందని జిల్లా సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ తెలిపారు.

క్రీడాకారుల అభిమానానికి కక్షగట్టిన దుండగులు

ముంత మల్లయ్య ఫ్లెక్సీలను రాత్రికి రాత్రే ధ్వంసం చేసిన గుర్తుతెలియని వ్యక్తులు

వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్.



మండల కేంద్రంలో రాజకీయ కక్షలు మరోసారి తెరపైకి వచ్చాయా అనే అనుమానాలకు ఫ్లెక్సీల ధ్వంసం ఘటన తావిస్తోంది. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు ముంత మల్లయ్యకు క్రీడాకారులు అభిమానంతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి వేళలో ధ్వంసం చేయడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పండుగ సందర్భంగా గ్రామంలో క్రీడలకు, వివిధ సామాజిక కార్యక్రమాలకు సహకారం అందిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న ముంత మల్లయ్య సేవలను గుర్తించిన క్రీడాకారులు అభిమానంతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అయితే ఈ ఫ్లెక్సీలను కొందరు గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి సమయంలో ఒకవైపు చింపి ధ్వంసం చేసినట్లు తెలుస్తోంది.క్రీడాకారుల అభిమానానికి ప్రతీకగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ధ్వంసం చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. గ్రామంలో క్రీడలను ప్రోత్సహించే వ్యక్తుల పట్ల ఇలాంటి చర్యలకు పాల్పడటం ఎంతవరకు సమంజసమని పలువురు చర్చించుకుంటున్నారు.అభిమానంతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ధ్వంసం చేసిన వారిని గుర్తించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పెద్ద చింతరేవుల ఆంజనేయ స్వామి ఆలయంలో వైభవంగా ప్రత్యేక అభిషేక పూజలు

- ఆశ్వీయుజ అమావాస్య సందర్భంగా వేలాదిగా తరలివచ్చిన భక్తులు

- భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేసిన పెద్ద చింతరేవుల అన్నప్రసాద ట్రస్ట్



గద్వాల నవంబర్ 09(ప్రజా జ్యోతి ప్రతినిధి):

జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల పరిధిలోని పెద్ద చింతరేవుల గ్రామంలో కొలువుదీరిన 15వ,శతాబ్దపు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో ఆశ్వీయుజ అమావాస్య సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బ్రహ్మ ముహూర్తంలో స్వామివారికి పంచామృత అభిషేకం, ఆకుపూజ తదితర ప్రత్యేక పూజలను నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఆద్య చక్రవర్తి కేశవాచార్యులు తెలిపారు.ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.స్వామివారిని దర్శించుకున్న భక్తులకు పెద్ద చింతరేవుల అన్నప్రసాద ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు.భక్తులు దాసంగం రూపంలో భక్తిశ్రద్ధలతో అన్నప్రసాదాన్ని స్వామివారికి సమర్పించారు.వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తమ వాహనాలకు ప్రత్యేక పూజలు చేయించుకున్నారు.ఆలయ ప్రాంగణంలో భక్తులు భజనలు,కీర్తనలు ఆలపిస్తూ ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు.కర్ణాటక ప్రాంతం నుంచి వచ్చిన భక్తులు,భజన మండలి సభ్యులు ప్రత్యేక భజనలు నిర్వహించారు.రాత్రి వేళలోనూ పలువురు భక్తులు స్వామివారి సన్నిధిలోనే బస చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఆద్య వామనాచారి,ఆద్య కిష్టాచారి,ఆద్య మద్వాచారితో పాటు పెద్ద చింతరేవుల అన్నప్రసాద



ట్రస్ట్ సభ్యులు,వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు,మహిళలు, చిన్నారులు వేలాదిగా పాల్గొన్నారు.

గోపాల్ దీన్నే గ్రామంలో ఏల్ నినో ప్రభావంపై గ్రామసభ

- త్రాగునీరు పరిష్కారానికి ముందస్తు చర్యలకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి.- సర్పంచ్ దొడ్ల కవిత.

వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్.

మండల పరిధిలోని గోపాల్ దీన్నే గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ సర్పంచ్ దొడ్ల కవిత అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ దొడ్ల కవిత మాట్లాడుతూ ఏల్ నినో ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో గ్రామంలో త్రాగునీరుకు ఇబ్బందులేకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని వారన్నారు. ప్రతి ఒక్కరు ఇంకుడు గుంతలు ఇంటిదగ్గర నిర్మించుకోవాలని. గ్రామంలో కరువు వచ్చే అవకాశం ఉంది కాబట్టి ఉపాధి హామీ అందరికీ పని దొరికే విధంగా ప్రణాళిక బద్ధంగా పనులు గుర్తించి అందరికీ ఉపాధి పని అదే విధంగా ప్రయత్నం చేయాలని వారు అన్నారు. గ్రామంలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం, ప్రజాప్రతినిధులకు, అధికారులకు తెలియజేసి సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తామని వారన్నారు.ఈ గ్రామ సభలో పంచాయతీ కార్యదర్శి కర్ణాకర్, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ గంగాధర్, జిపిఓ నరసింహ,వార్డ్ మెంబర్స్ కురుమయ్య, నరేష్, చంద్రయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి డి బాల్ రెడ్డి, గ్రామ పెద్దలు శేఖర్, శేఖర్ రెడ్డి, కురుమయ్య, అంగన్వాడీ టీచర్స్, గ్రామ యువకులు గోపాలస్వామి, సుధాకర్, రాజు, సురేష్,ప్రవీణ్ కుమార్ రెడ్డి, మల్లేష్ గ్రామ రైతులు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నీటిని కాపాడుకుందాం..... భవిష్యత్తును నిలబెట్టుకుందాం

మహమ్మాదాబాద్ నవంబర్ 09(ప్రజా జ్యోతి)

మండల పరిధి లోని కొలిమికుచ్చ తాండా గ్రామ పంచాయతీ లో జలమహోత్సవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అరుణ రాజు మాట్లాడుతూ నీటిని వృధా చేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వినియోగించాలని చెరువులు కుంటలు ఇతర నేటి వనరులు పరిరక్షించాలని సూచించారు భవిష్యత్తు తరాలకు నీటి కొరత లేకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తో పాటు ఉప సర్పంచ్ రవి సెక్రటరీ శ్రీకాంత్ రెడ్డి, ఆర్ డబ్ల్యూ ఎస్ దీప్తి వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.





ప్రజాజ్యోతి

మంగళవారం 10 నవంబర్ 2026

ప్రజల వినతులను సత్వరమే పరిష్కరించాలి - నేటి ప్రజావాణికి 23 దరఖాస్తులు

నాగర్ కర్నూల్ నవంబర్ 9 (ప్రజా జ్యోతి బ్యూరో)

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి ఫిర్యాదుదారులకు సమాచారం అందించాలి,అధికారులకు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.సోమవారం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, అదనపు కలెక్టర్లు బి. చెన్నయ్య, బి. దేవసహాయం కలిసి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు, వినతిపత్రాలను స్వీకరించారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి వాటి పరిష్కారం కోసం వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ...., ప్రజావాణిలో వచ్చిన ప్రతి ఫిర్యాదును సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధించిన సమాచారాన్ని ఫిర్యాదుదారులకు తెలియజేయడంతో పాటు, ఆ వివరాలను ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేయాలని స్పష్టం చేశారు.ఒకవేళ ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు తమ శాఖ పరిధిలోకి రాకపోతే, సంబంధిత శాఖకు అధికారికంగా లేఖ రాసి పంపించాలని సూచించారు. ఫిర్యాదును తమ శాఖ పరిధిలోనే పెండింగ్‌లో ఉంచకుండా, సంబంధిత శాఖకు బదిలీ చేసి పరిష్కారానికి



అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే, ఏదైనా సమస్యను పరిష్కరించడం సాధ్యం కాని పరిస్థితి ఉంటే, దానికి గల కారణాలను స్పష్టంగా తెలియజేయాలని, సంబంధిత నిబంధనల ప్రకారం పరిష్కారం సాధ్యం కాకపోతే ఆ విషయాన్ని ఫిర్యాదుదారులకు వివరించాలని సూచించారు. అధికారుల స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి ప్రయత్నించాలని కలెక్టర్ తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను తమ వద్ద పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత సమయంలోపరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను సంబంధిత అధికారులు ప్రత్యేకంగా పరిశీలించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.ముఖ్యమంత్రి కార్యాలయం, జిల్లా మంత్రి కార్యాలయం నుంచి ప్రజావాణి ద్వారా వచ్చిన దరఖాస్తులను



కూడా అత్యంత ప్రాధాన్యతతో తీసుకొని సత్వరమే పరిష్కరించాలని అన్ని శాఖల జిల్లా అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం జరగకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 23 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పాండు, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, వివిధ విభాగాల...సూపరింటెండెంట్లు, అన్ని శాఖల జిల్లా అధికారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పెంకుటిళ్ల నుంచి పక్కా ఇళ్లకు.. పేదల ముంగిట దీపావళి వెలుగులు.!

- ఇందిరమ్మ ఇళ్లలో తొలి దీపావళి.. లబ్ధిదారుల ఆనందంలో భాగస్వామైన కలెక్టర్ ఖుష్బూ గుప్తా

- మహబూబ్‌నగర్ జిల్లాలో 3,845 ఇళ్ల నిర్మాణాలు పూర్తి- రాష్ట్రవ్యాప్తంగా 2.30 లక్షల ఇళ్లలో గృహప్రవేశాలు

- చిన్నదర్‌పల్లిలో లబ్ధిదారుల కుటుంబాలతో కలిసి పండుగ సంబరాలు

మహబూబ్‌నగర్, నవంబర్ 8 (ప్రజా జ్యోతి బ్యూరో):

నిన్నటి వరకు పెంకుటిళ్లలో బతుకులు వెళ్లదీసిన నిరుపేద కుటుంబాలు.. నేడు సొంతింటి ముంగిట దీపాలు వెలిగిస్తూ దీపావళి సంబరాలు జరుపుకుంటున్నాయి. ఏళ్ల తరబడి సొంత గూడు కోసం ఎదురుచూసిన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా గృహ నిర్మాణానికి ఆర్థిక సహాయం అందడంతో వారి కలలు సాకారమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం మహబూబ్‌నగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 15వ వార్డు చిన్నదర్‌పల్లిలో 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమం సందడిగా సాగింది. జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారి కుటుంబ సభ్యులతో కలిసి పండుగ జరుపుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

పేదల ఇళ్లలో కలెక్టర్ దీపావళి సందడి

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు మూడవత్ మంజుల, సభవత్ పద్మశ్రీ కుటుంబాలను కలెక్టర్ ఖుష్బూ గుప్తా సందర్శించారు. వారికి స్వీట్లు, టపాసులు అందజేసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులను శాలువాలతో సత్కరించారు. అనంతరం వారితో కలిసి టపాసులు కాల్చి పండుగ సంబరాల్లో పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ దశలవారీగా ఇళ్లు

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన నిరుపేదలకు గృహ నిర్మాణానికి అవకాశం కల్పిస్తున్నట్లు వివరించారు. మొదటి విడతలో ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేయగా, రెండో విడతలో అదనంగా మరో 2,000 ఇళ్లను కేటాయించినట్లు తెలిపారు. అర్హులైన పేదలందరికీ దశలవారీగా ఇళ్లను మంజూరు చేస్తామని వెల్లడించారు.

జిల్లాలో 3,845 ఇళ్ల నిర్మాణాలు పూర్తి

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.30 లక్షల ఇందిరమ్మ ఇళ్లలో గృహప్రవేశాలు జరిగినట్లు కలెక్టర్ వెల్లడించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఇప్పటివరకు 3,845 ఇళ్ల నిర్మాణాలు పూర్తయినట్లు తెలిపారు. కొత్త ఇళ్లలో తొలి దీపావళి జరుపుకుంటున్న లబ్ధిదారులందరికీ ఆమె శుభాకాంక్షలు తెలియజేశారు.



మా సొంతింటి కల నిజమైంది: లబ్ధిదారులు

గతంలో పెంకుటిళ్లలో నివసించిన తమకు ఇందిరమ్మ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందడంతో సొంతింటి కల నెరవేరిందని లబ్ధిదారులు మూడవత్ మంజుల, సభవత్ పద్మశ్రీ ఆనందం వ్యక్తం చేశారు. తమ ఇళ్లకు జిల్లా కలెక్టర్ స్వయంగా వచ్చి కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి జరుపుకోవడం మరచిపోలేని అనుభూతిని కలిగించిందన్నారు. తమకు గృహ నిర్మాణానికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఉపేందర్ రెడ్డి, డిప్యూటీ ఈఈ విజయ్ కుమార్, ఏఈలు శ్రీను, వైష్ణవి, 15వ వార్డు కార్పొరేటర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులపై నిర్లక్ష్యం వద్దు.!

- బాధితులకు సత్వర న్యాయం అందించాలి..

- అధికారులకు ఎస్పీ జానకి ఆదేశం

మహబూబ్‌నగర్, నవంబర్ 09 (ప్రజా జ్యోతి బ్యూరో):



ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం చేయకుండా, ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించాలని జిల్లా ఎస్పీ దరావత్ జానకి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఎస్పీ స్వయంగా వినతులు స్వీకరించారు. ఒక్కొక్కరి సమస్యను అడిగి తెలుసుకుని, వారి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో మాట్లాడి, ఫిర్యాదులపై చట్టపరిధిలో సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును ప్రత్యేకంగా పరిగణించి, పరిష్కార ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం, జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీసు శాఖను ఆశ్రయించినప్పుడు వారికి నమ్మకం కలిగించేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీసు శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని ఆమె తెలిపారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల గోడు.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా.!

- క్రమబద్ధీకరణ, సమాన పనికి సమాన వేతనం కల్పించాలి

- డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్‌కు వినతిపత్రం

మహబూబ్‌నగర్, నవంబర్ 09 (ప్రజా జ్యోతి బ్యూరో):



వైద్య ఆరోగ్య శాఖలో కీలకంగా సేవలందిస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ వైద్యులు, ఉద్యోగులు తమ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం డీసీసీ అధ్యక్షులు అంగంపల్లి సంజీవ్ ముదిరాజ్‌ను ఆశ్రయించారు. సోమవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసిన ఉద్యోగుల ప్రతినిధి బృందం తమ న్యాయమైన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేసింది.ఈ సందర్భంగా ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని వారు ప్రధానంగా కోరారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు, ఇతర ఆర్థిక ప్రయోజనాలను వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులకు హెల్త్ ఇన్సూరెన్స్, ఈహెచ్ఎస్, ఈఎస్ఐ వంటి వైద్య సదుపాయాలు కల్పించాలని, ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు ప్రభుత్వం చొరవ తీసుకుని శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను, వారి డిమాండ్లను సంజీవ్ ముదిరాజ్ సావధానంగా విన్నారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న ఎన్‌హెచ్‌ఎం సిబ్బందికి ఉద్యోగ భద్రత, ఆర్థిక భరోసా కల్పించాలనే డిమాండ్ మరోసారి తెరపైకి రావడంతో ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

ఓటు హక్కు కోల్పోయే పరిస్థితి వద్దు.. ఏఎస్డీడీ ఓటర్లకు మరో అవకాశం!

- అర్హులైన ప్రతి ఒక్కరికీ తుది ఓటర్ల జాబితాలో చోటు కల్పించాలి

- రాజకీయ పార్టీల ప్రతినిధులతో అదనపు కలెక్టర్ హరిప్రియ సమీక్ష

మహబూబ్‌నగర్ నవంబర్ 10 (ప్రజా జ్యోతి బ్యూరో):

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ--2026 ప్రక్రియలో భాగంగా గైర్హాజరు, నివాసం మారినవారు, మరణించినవారు, ద్వంద్వ ఓటర్ల జాబితాలో పేర్లు నమోదైన కారణంగా ముసాయిదా ఓటర్ల జాబితాలో చోటు దక్కని అర్హులైన ఓటర్లకు మరో అవకాశం కల్పించినట్లు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ), జడ్చర్ల నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి జె.ఎల్.బి. హరిప్రియ వెల్లడించారు. జడ్చర్ల తహసీల్దార్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించి ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ--2026 పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా హరిప్రియ మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గైర్హాజరు, నివాసం మారినవారు, మరణించినవారు, ద్వంద్వ ఓటర్లుగా గుర్తించిన కారణాలతో ముసాయిదా జాబితాలో పేర్లు లేని ఓటర్లకు తగిన పరిశీలన అనంతరం తుది జాబితాలో పేర్లు చేర్చుకునేందుకు మరో అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ మేరకు సంబంధిత జాబితాలను మరోసారి రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేసి, అర్హులైన ఓటర్లను గుర్తించి వారి వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. రాజకీయ పార్టీల బూత్ స్థాయి ప్రతినిధులు, బూత్ స్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటూ అర్హులైన ఓటర్లు అవసరమైన ఆధారాలతో తమ అభ్యర్థనలు సమర్పించేలా సహకరించాలని కోరారు. ఈ అవకాశంపై ఎన్నికల అధికారులు, రాజకీయ పార్టీలు విస్తృతంగా ప్రచారం నిర్వహించి అర్హులైన ప్రతి ఓటరికి సమాచారం చేరవేయాలని సూచించారు. అనంతరం ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అందిన అభ్యర్థనలు, అభ్యంతరాల పరిష్కార పురోగతితో పాటు ఏఎస్డీడీ జాబితాలోని ఓటర్ల పునఃపరిశీలనపై సమీక్షించారు. క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి, నిర్ణీత గడువులోగా అభ్యర్థనలు, అభ్యంతరాలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా



తుది ఓటర్ల జాబితాలో చోటు కోల్పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జడ్చర్ల, బాలానగర్, రాజాపూర్, నవాబ్‌పేట, మిడ్జిల్ మండలాల తహసీల్దార్లు, అదనపు తహసీల్దార్, ఉప తహసీల్దార్‌తో పాటు సంబంధిత మండలాల మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



లాంగ్ జంప్‌లో సత్తా చాటిన యాస్మీన్

- రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

గద్వాల నవంబర్ 9(ప్రజా జ్యోతి ప్రతినిధి):

క్రీడా రంగంలో ప్రతిభను చాటుతూ గద్వాల మైనారిటీ గురుకుల బాలికల కళాశాల విద్యార్థిని యాస్మీన్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.ఎస్ జి ఎఫ్ అండర్-19 విభాగంలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో లాంగ్ జంప్ ఈవెంట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి,ఈ అవకాశాన్ని దక్కించుకున్నారు.శనివారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో యాస్మీన్ తన క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు.గద్వాలలోని తెలంగాణ మైనారిటీ గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న యాస్మీన్ సాధించిన విజయంపై కళాశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.పార్వతి,వ్యాయామ ఉపాధ్యాయురాలు నేహా పర్వీన్,జూనియర్ అధ్యాపకులు యాస్మీన్‌ను అభినందించారు.రాష్ట్రస్థాయిలోనూ ప్రతిభ కనబరిచి కళాశాలకు,జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఈ నెల 12న,కాలేయ వ్యాధిగ్రస్తులకు ఉచిత ఫైబ్రో స్కాన్
- డాక్టర్.జగదీశ్ మణికంఠ

నాగర్ కర్నూల్ : నవంబర్ 09 (ప్రజా జ్యోతి)

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలో గల శ్రీ మణికంఠ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో కాలేయ వ్యాధిగ్రస్తులకు,లివర్ సమస్య ఉన్నవారికి ఈనెల 12న,(గురువారం)ఉదయం 9:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటలవరకు ఉచితంగా ఫైబ్రోస్కాన్ నిర్వహిస్తున్నట్లు గ్యాస్ట్రాలజీ నిపుణులు డాక్టర్.మణికంఠ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.నాగర్ కర్నూల్ జిల్లా వ్యాప్తంగా లివర్ సమస్య ఉన్నవారు,షుగర్ వ్యాధిగ్రస్తులు,మద్యపానం అలవాటు ఉన్నవారు,ఫ్యాటీ లివర్ ఉన్నవారు,ధూమపానం అలవాటు ఉన్నవారు తప్పనిసరిగా పాల్గొని ఉచితంగా 5 వేల రూపాయల విలువగల ఫైబ్రోస్కాన్ ను ఉచితంగా చేయించుకోవాలని వివరాలకు రోగులు, వ్యాధి అనుమానితులు 9885880155,9885880166 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.



మాగనూరులో అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల దాడి..
- నాలుగు ఇసుక టిప్పర్లు సీజ్..

మాగనూరు,నవంబర్09(ప్రజా జ్యోతి)

మండలంలో అక్రమ ఇసుక రవాణాపై పోలీసులు దాడులు నిర్వహించి నాలుగు టిప్పర్లను సీజ్ చేశారు. ఎస్సై ఆదేశాల మేరకు తెల్లవారుజామున చేపట్టిన తనిఖీల్లో వడ్వాట్ గ్రామ శివార్లలో రెండు, వడ్వాట్ నుంచి చందాపూర్ వెళ్లే మార్గంలో మరో రెండు టిప్పర్లను పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు, పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించి వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి సంబరాలు..
పేదల ఇంట పండుగ వెలుగులు!

- ఒకవైపు దీపాల కాంతులు.. మరోవైపు సొంతింటి ఆనందాలు.
- మంత్రి జూపల్లి కృష్ణారావు చొరవతో నెరవేరిన చిరకాల స్వప్నం.

వీపనగండ్ల, ప్రజా జ్యోతి రిపోర్టర్:

మండల పరిధిలోని వల్లవాపురం తండ గ్రామపంచాయతీకి చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారురాలు సబావత్ లక్ష్మి, భర్త హనుమంత్ కుటుంబం తమ నూతన గృహంలో దీపావళి పండుగను ఘనంగా జరుపుకుంది. ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూసిన ఆ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో ఈ ఏడాది దీపావళి మరింత ప్రత్యేకంగా మారింది. ఒకవైపు దీపాల వెలుగులు మరోవైపు సొంతింటి సంబరాలతో కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేక చొరవతో అనేకమంది పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు.పేద కుటుంబాలకు సొంతిల్లు కేవలం నివాసం మాత్రమే కాదని, అది ఆత్మగౌరవానికి, భద్రతకు ప్రతీక అని పేర్కొన్నారు. పండుగ వేళ సొంతింటిలో దీపావళి జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా



ఎన్నో పేద కుటుంబాల చిరకాల స్వప్నాలు నెరవేరుతున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శివమ్మ, పంచాయతీ కార్యదర్శి దర్గయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు సబావత్ శివ నాయక్, కాట్రావత్ చత్రు నాయక్, నారమ్మ, సీతమ్మ, బొజ్జ నాయక్, చిన్న తిరుపతి, స్థానిక నాయకులు, లబ్ధిదారులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మఖ్తల్ రూపురేఖలు మార్చేలా సమగ్ర అభివృద్ధి కార్యచరణ

- మఖ్తల్ లో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి వాకిటి శ్రీహరి



మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి,నవంబర్ 09 (ప్రజా జ్యోతి):

మఖ్తల్ నియోజకవర్గ రూపురేఖలను మార్చేందుకు సమగ్ర అభివృద్ధి కార్యచరణ వేగవంతంగా కొనసాగుతుందని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం నారాయణపేట జిల్లా మఖ్తల్ మున్సిపాలిటీ తో పాటు వివిధ గ్రామాలలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను మంత్రి వాకిటి శ్రీహరి అధికారులతో కలిసి పరిశీలించారు. మఖ్తల్ మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో కేశవ నగర్ నుంచి దండు వరకు 2.5 కోట్ల వ్యయంతో చేపడుతున్న రహదారి, వంతెన నిర్మాణ పనులను మంత్రి వాకిటి శ్రీహరి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని, నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని, నిర్ణీత సమయంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్లకు అధికారులకు మంత్రి సూచించారు. మఖ్తల్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ప్రజల రోజువారీ ప్రయాణాలకు ఇబ్బందులు లేకుండా రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ బలోపేతం, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.మఖ్తల్ పట్టణ అభివృద్ధే లక్ష్యంగా ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రత్యేక దృష్టి దృష్టి సారిస్తున్నామని మంత్రి అన్నారు.





గతంలో ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్యలను ఒక్కొక్కటిగా గుర్తించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. పట్టణంలోని ప్రతి వార్డుకు సమాన ప్రాధాన్యతనిస్తూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా నిధులు కేటాయించి పనులు చేపడుతున్నట్లు మంత్రి వెల్లడించారు.మఖ్తల్ రూపురేఖలు మార్చేలా సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయని, అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడకుండా ప్రజలకు ఇచ్చిన హామీలను కార్యరూపంలోకి తీసుకొస్తామని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస హనుమంతు,వార్డు కౌన్సిలర్ కర్రెం మహేష్, గొల్లపల్లి సర్పంచ్ సూర్యకుమార్, డి.ఈ ఉపేందర్ రెడ్డి, కాంట్రాక్టర్ మధుసూదన్ రెడ్డి, రైతులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నంబావి కృష్ణానది ముంపు భూములపై ప్రజావాణికి ఫిర్యాదు..!

- కృష్ణానది ముంపు భూముల్లో వేలం.. అక్రమ సాగు

- కోట్ల రూపాయల్లో వేలం పాటలు.. అధికారుల విచారణ ఏదీ?

- మూగజీవాలకు మేత, తాగునీరు కరువు.. గొర్రెల కాపరుల ఆవేదన

- ముంపు భూములపై కలెక్టర్ సమగ్ర విచారణ జరపాల్సి

చిన్నంబావి, నవంబర్ 9 (ప్రజాజ్యోతి)

ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు కరువయ్యాయి. చిన్నంబావి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి కేవలం ఒక్క ఫిర్యాదు మాత్రమే అందింది. అయితే ఆ ఒక్క ఫిర్యాదు వెనుక కృష్ణానది ముంపు భూముల్లో సాగుతున్న వ్యవహారం, మూగజీవాల మేతకు ఎదురవుతున్న ఇబ్బందులు, వేలం పాటలపై అనేక ప్రశ్నలు తెరపైకి వచ్చాయి. నది లోతట్టు ప్రాంతాల్లో పంటల సాగుతో గొర్రెలు, మేకలు, పశువులకు మేత, తాగునీరు దొరకని పరిస్థితి నెలకొంటోందని ఫిర్యాదుదారులు ఆవేదన వ్యక్తం చేశారు.

ముంపు భూముల్లో సాగు..మూగజీవాలకు శాపం

చెల్లెపాడు కృష్ణానది లోతట్టు పరీవాహక ప్రాంతాల్లో రైతులు అక్రమంగా విత్తనాలు వేసి పంటలు సాగు చేస్తున్నారని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. పంటల సాగులో క్రిమిసంహారక మందులు పిచికారీ చేయడం, రసాయన ఎరువులు వినియోగించడం వల్ల సహజంగా మొలవాల్సిన గడ్డి కూడా మొలవడం లేదని పేర్కొన్నారు. దీంతో గొర్రెలు, మేకలు, పశువులకు మేత దొరకకపోవడంతో పాటు తాగునీటి సమస్య కూడా తీవ్రమవుతోందని తెలిపారు. పశు సంరక్షణ చట్టం, సంబంధిత జీఓల ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులకు వినతిపత్రం అందజేశారు.

వేలం పాటల వెనుక ఏముంది?

చిన్నంబావి మండలంలో కృష్ణానది తేలిన భూముల్లో వేలం ద్వారా పంటల సాగు కొనసాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల మూడు గ్రామాల్లో కోట్ల రూపాయల విలువైన వేలం పాటలు జరిగినట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. ఇంత పెద్ద మొత్తంలో వేలాలు జరుగుతున్నా రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ చేపట్టకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. వేలం పాటలు నిర్వహిస్తున్న తీరు, వసూలైన మొత్తాలు, సాగుకు అనుమతులపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. నది ముంపు భూముల్లో సాగు చేయడం వల్ల



భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు తలెత్తుతాయోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

మేత భూములపై పంటల సాగు వద్దు

కృష్ణానది పరివాహక గ్రామాల్లో పశువుల మేతకు ఉపయోగపడే భూముల్లో పంటలు సాగు చేయడం వల్ల గొర్రెలు, మేకల పెంపకంపై ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మేతకు భూములు లేకపోవడం, తాగునీటి వసతి తగ్గిపోవడంతో పశుపోషణ కష్టతరంగా మారుతోందని చెబుతున్నారు. పంటల సాగును నిలిపివేసి మూగజీవాలకు మేత, నీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు భూముల సాగు విషయంలో ఎప్పుడు ఏ



వివాదం తలెత్తుతుందోనన్న సందిగ్ధ పరిస్థితులు నెలకొంటున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.

అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

కృష్ణానది ముంపు భూముల వ్యవహారంపై ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసు అధికారులు సంయుక్తంగా గ్రామాల్లో పర్యటించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. అక్రమ సాగు, వేలం పాటల నిర్వహణపై సమగ్ర విచారణ చేపట్టి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ముంపు భూములను స్వాధీనం చేసుకోవడంతో పాటు వేలం ద్వారా వసూలైన డబ్బులపై కూడా విచారణ జరపాలని, జిల్లా కలెక్టర్ స్పందించి ఈ వ్యవహారానికి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

ప్రజావాణికి ఒక్క వినతి

మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి వచ్చిన ఒక్క ఫిర్యాదును స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు పంపించినట్లు ఎంపీడీఓ సుర్ణ ఆదర్శ్ గౌడ్ తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీఓ రామస్వామి, ఏపీఓ ధనుంజయ రాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వృద్ధుల హక్కులకు అండగా న్యాయ సేవాధికార సంస్థ

- జడ్చర్ల వృద్ధాశ్రమంలో జాతీయ న్యాయ సేవల దినోత్సవం..

ఉచిత న్యాయ సహాయంపై అవగాహన

మహబూబ్ నగర్, నవంబర్ 09 (ప్రజా జ్యోతి బ్యూరో):



వృద్ధులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, న్యాయపరమైన సమస్యలు ఎదురైనప్పుడు ఉచిత న్యాయ సహాయాన్ని వినియోగించుకోవాలని అదనపు జూనియర్ సివిల్ జడ్జి మొహమ్మద్ ముద్దసిర్ సూచించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎన్. ప్రేమలత ఆదేశాల మేరకు జాతీయ న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా సోమవారం జడ్చర్లలోని వృద్ధాశ్రమంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు న్యాయ సేవల ప్రాముఖ్యత, ఉచిత న్యాయ సహాయం పొందే విధానం, సీనియర్ పౌరుల హక్కులు, తల్లిదండ్రులు మరియు వృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం--2007, ఆస్తి హక్కులు తదితర అంశాలపై వివరంగా అవగాహన కల్పించారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను ఆదరించడం, వారి పోషణ బాధ్యతలను నిర్వర్తించడం కుటుంబ సభ్యుల బాధ్యత అని, వృద్ధుల హక్కులకు చట్టపరమైన రక్షణ ఉందని వివరించారు. ఆస్తి సంబంధిత సమస్యలు లేదా ఇతర న్యాయపరమైన ఇబ్బందులు ఎదురైతే భయపడకుండా సంబంధిత న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. అర్హులైన వారు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని, న్యాయం పొందేందుకు ఆర్థిక పరిస్థితులు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో న్యాయ సేవాధికార సంస్థ పనిచేస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, న్యాయ సేవా స్వచ్ఛంద కార్యకర్తలు, వృద్ధాశ్రమ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

రైతు మేళాకు దూరమైన చిన్నంబావి రైతన్నలు!

-17 గ్రామాలకు రెండే బస్సులు.. రైతులకు అందని ఎక్స్‌పో సమాచారం







చిన్నంబావి, నవంబర్ 09 (ప్రజాజ్యోతి)

రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సాగు యంత్రాలపై అవగాహన కల్పించాలనే ప్రభుత్వ లక్ష్యం అధికారుల ప్రచార లోపంతో నీరుగారిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మెగా రైతు మేళా ఉ ఇండస్ట్రియల్ ఎక్స్‌పోకు చిన్నంబావి మండలం నుంచి రైతులను తరలించే విషయంలో వ్యవసాయ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరించిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని 17 గ్రామ పంచాయతీలకు కేవలం రెండు బస్సులు ఏర్పాటు చేయడం.. ఆ సమాచారం సైతం గ్రామాల్లో విస్తృతంగా చేరకపోవడంతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారం వాట్సాప్ గ్రూపులకే పరిమితమైతే క్షేత్రస్థాయిలో రైతులకు ప్రయోజనం ఎలా చేకూరుతుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రైతు మేళా నిర్వహణపై ముందస్తు ప్రచారం లేకపోవడం ప్రధాన విమర్శగా మారింది. గ్రామాల్లో దండోరా వేయించకపోవడం, రైతులకు ప్రత్యక్షంగా సమాచారం అందించకపోవడంతో చాలామందికి ఎక్స్‌పోకు వెళ్లే అవకాశం లేకుండా పోయింది. 17 గ్రామాలకు రెండు బస్సులే కేటాయించడంతో రవాణా సౌకర్యం కూడా సరిపోలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మాకు ముందే చెబితే వెళ్లేవాళ్లం: రైతుల ఆవేదన

కొప్పునూర్ గ్రామానికి చెందిన రైతు కురుమయ్య మాట్లాడుతూ.. “మేము రోజూ పొలం పనుల్లో ఉండే రైతులం. ఇలాంటి రైతు మేళాలు ఎక్కడ జరుగుతున్నాయో, ఎప్పుడు బస్సులు వస్తాయో ముందుగానే తెలియాలి. గ్రామంలో దండోరా వేయించి, రైతులకు సమాచారం ఇచ్చి ఉంటే మేమంతా వెళ్లేవాళ్లం. ఆధునిక వ్యవసాయ యంత్రాలు, కొత్త సాగు పద్ధతులు చూసి నేర్చుకునే అవకాశం ఉండేది. వాట్సాప్‌లో మెసేజ్‌లు పెడితే అందరు రైతులకు ఎలా తెలుస్తుంది? అధికారుల ప్రచారం లేకపోవడంతో మాకు ఉపయోగపడే అవకాశాన్ని కోల్పోయాం” అని ఆవేదన వ్యక్తం చేశారు.

రైతు మేళా.. అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం!

రైతు మేళా సమాచారం ప్రజాప్రతినిధులకు సైతం అందించక పోవడంపై సింగిల్ విండో డైరెక్టర్ దేగ శేఖర్ యాదవ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. “నేను ప్రజాప్రతినిధిని.. రైతులకు ప్రాతినిధ్యం వహించే వ్యక్తిని. నాకే ఈ కార్యక్రమం గురించి అధికారులు సమాచారం ఇవ్వలేదు. ప్రజాప్రతినిధులకే తెలియని కార్యక్రమం సామాన్య రైతులకు ఎలా చేరుతుంది? గ్రామాల్లో ప్రచారం చేయకుండా, రైతులకు అవగాహన కల్పించకుండా కార్యక్రమాలు నిర్వహిస్తే ప్రయోజనం ఏమిటి?” అని ప్రశ్నించారు. అధికారుల సమన్వయ లోపం కారణంగా రైతులు ప్రభుత్వ కార్యక్రమాల ప్రయోజనాలకు దూరమవుతున్నారని విమర్శించారు.

సర్వే పనుల్లో బిజీగా ఉన్నాం: ఏఈవో

ఈ అంశంపై కొప్పునూర్ వ్యవసాయ విస్తరణ అధికారి సుభాన్ పాషాను వివరణ కోరగా.. వ్యవసాయ శాఖ వాట్సాప్ గ్రూపులు, ప్రజాప్రతినిధుల ద్వారా రైతులకు సమాచారం అందించామని తెలిపారు. పంట నష్టపరిహారం సర్వే వంటి అత్యవసర విధుల్లో ఉన్నప్పటికీ అందుబాటులో ఉన్న వనరులతో బస్సులు ఏర్పాటు చేసి రైతులను తరలించామని, ఉద్దేశపూర్వకంగా సమాచారం నిలిపివేయలేదని వివరించారు.మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్ గౌడ్‌ను ఈ అంశంపై వివరణ కోరేందుకు ప్రతినిధి వాట్సాప్ ద్వారా సంప్రదించినప్పటికీ స్పందన రాలేదు. రైతులకు ఉపయోగపడే ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారం, అమలులో అధికారుల బాధ్యతాయుతమైన వ్యవహారశైలిపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు సమన్వయంతో వ్యవహరించి, గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం చేపట్టి ప్రభుత్వ కార్యక్రమాల ప్రయోజనాలు ప్రతి రైతుకూ అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఇందిరమ్మ ఇళ్లలో ఘనంగా దీపావళి సంబరాలు

నాగర్ కర్నూల్ : నవంబర్ 09 (ప్రజా జ్యోతి)

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ మండలాల పరిధిలోని వివిధ గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కుటుంబాలలో వెలుగులు నింపాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం దీపావళి పండుగ సందర్భంగా “మన ఇందిరమ్మ ఇంట్లో దీపావళి” కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నాగర్కర్నూల్ జిల్లాలోని వివిధ మండలాల గ్రామాలలో సర్పంచులు,ఉప సర్పంచులు,వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు,కాంగ్రెస్ నాయకులుఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులతో కలిసి టపాసులు కాల్చి,దీపాలు వెలిగించి దీపావళి సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.









తప్పిపోయిన బాలికను గుర్తించిన పోలీసులు

- హర్షం వ్యక్తం చేసిన పట్టణ ప్రజలు

నాగర్ కర్నూల్ : నవంబర్ 09 (ప్రజా జ్యోతి)

నాగర్కర్నూల్ జిల్లా కేంద్రంలో సోమవారం సాయంత్రం తప్పిపోయిన బాలికను పట్టణ పోలీసులు వే గంగా స్పందించి బాలికను సురక్షితంగా తల్లితండ్రులు అప్పగించారు.తప్పిపోయిన రెండు గంటల వ్యవధిలో బాలికను వ్యతికి తల్లితండ్రులకు అప్ప గించడంపై పోలీస్ సిబ్బందిని పట్టణ ప్రజలు అభినందించారు.



గుడిపల్లి నుండి కురుమూర్తికి తరలిన తొలి దీపం

- నేటి నుండి కురుమూర్తి జాతర ప్రారంభం

నాగర్ కర్నూల్ : 09 నవంబర్ (ప్రజా జ్యోతి)



కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల తొలి దీపాన్ని (సమురు) నాగర్ కర్నూల్ మండల పరిధిలోని గు డిపల్లి గ్రామం నుంచి ఘనంగా తరలించారు.ఈ నెల 10 నుంచి 20 వరకు కురుమూర్తి ఉత్సవాలు జరగనున్నాయని నవంబర్ 16న, ఉద్దాల మహో త్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.గుడిపల్లి గ్రామ ప్రజలు ప్రతి సంవత్సరం తమ ఆనవాయితీగా డప్పు,భజనలతో,వైయిద్యాలతో అంగరంగ వైభవంగా తొలి దీపాన్ని కాలినడకన కురుమూర్తికి తరలిస్తారు.

-నేటి నుంచే కురుమూర్తి జాతర ప్రారంభం :-

మహబూబ్ నగర్ జిల్లా చిన్నచింతకుంట మండల పరిధిలోని అమ్మాపూర్ గ్రామ శివారులోని గుట్టల్లో వెలిసిన కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలకు దేవస్థానం కమిటీ సభ్యులు ఏర్పాట్లుపూర్తి చేశారు.భక్తుల సౌకర్యార్థం, పుష్కరిణి, భక్తులకు విశ్రాంతిభవనాలు,స్వామిని సందర్శించుకునేందుకు వచ్చేభక్తులకు లడ్డు ప్రసాదం,తలనీలాలు సమర్పించు కునేందుకు కేశఖండనశాల,ఇతర ఏర్పాట్లు చురు కుగా కొనసాగుతున్నాయని నిర్వాహకులు తెలిపారు.

ఎన్హెచ్ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలి.!

- రాజ్యాంగ హక్కుల ప్రకారం క్రమబద్ధీకరించాలి..

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

- ఉద్యోగుల ధర్నాకు పీయూజేఏసీ చైర్మన్ పోలే నరేందర్ మాదిగ మద్దతు

మహబూబ్‌నగర్ నవంబర్ 10 (ప్రజా జ్యోతి బ్యూరో):

జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులు చేస్తున్న నిరసనకు పీయూజేఏసీ చైర్మన్, తెలంగాణ స్టూడెంట్ రెవల్యూషన్ జాక్ వ్యవస్థాపకులు పోలే నరేందర్ మాదిగ మద్దతు ప్రకటించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో పాల్గొని ఉద్యోగుల సమస్యలకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత రాజ్యాంగం కల్పించిన హక్కుల ప్రకారం ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి వైద్య ఆరోగ్య శాఖలో సేవలందిస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించకుండా కొనసాగించడం సరికాదని పేర్కొన్నారు. ఉద్యోగుల శ్రమకు తగిన ప్రతిఫలం అందించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. కనీస వేతనాలను పెంచడంతో పాటు ప్రతి నెలా నిర్దిష్ట తేదీన జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకు ప్రసవానికి ముందు, ప్రసవానంతర సెలవులు కల్పించాలని, ఉద్యోగులందరికీ బీమా సదుపాయాలు, ఇతర సంక్షేమ ప్రయోజనాలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజలకు వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఎన్‌హెచ్‌ఎం సిబ్బంది సమస్యలను ప్రభుత్వం ఇకనైనా గుర్తించి, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని పోలే నరేందర్ మాదిగ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో స్వేరో పాలమూరు యూనివర్సిటీ అధ్యక్షుడు పవన్ కుమార్, విద్యార్థి నాయకులు యోగి, రమేష్, విజయ్ తదితరులు పాల్గొని ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరసనకు మద్దతు తెలిపారు.



ఇందిరమ్మ ఇంటిలో మంత్రి వాకిటి శ్రీహరి

దీపావళి వేడుకలు

- గత పదేళ్లలో బిఆర్ఎస్ ఒక్క పేదోడికి ఇల్లు ఇవ్వలేదు

- పేదోడి సొంతింటి కలను సాకారం చేయడమే

ప్రజా ప్రభుత్వం లక్ష్యం: మంత్రి







మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి,నవంబర్ 09 (ప్రజా జ్యోతి):

?దీపావళి పండగ పర్వదినాన్ని పురస్కరించుకుని మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి కార్యక్రమంలో భాగంగా మఖ్తల్ మున్సిపాలిటీలోని 8వ వార్డు బాబు జగ్జీవన్ రావు కాలనీలో సత్తెమ్మ--విష్ణు దంపతుల నూతన ఇందిరమ్మ ఇంటిని రాష్ట్ర పశుసంవర్ధక మత్స్య క్రీడల యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ప్రారంభించి ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుల కుటుంబసభ్యులతో పాటు వార్డు కౌన్సిలర్ జట్ల అనిత కలిసి దీపావళి వేడుకలను జరుపుకున్నారు. అనంతరం ఇందిరమ్మ లబ్ధిదారుల కుటుంబాలకు కానుకను అందజేసి మంత్రి వాకిటి శ్రీహరి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి వారి ఇంట్లో వారితో పాటు నేలపై కూర్చొని కుటుంబ సభ్యులతో, వార్డు ప్రజలతో కాసేపు పిచ్చాపాటీగా మాట్లాడుతూ వారితో మమేకమాయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఈ కాలనీలో విద్యుత్ దీపాలు, మంచినీటి వసతి తదితర మౌలిక సదుపాయాలు కల్పించినట్లు గుర్తు చేశారు. పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ఇందిరమ్మ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందన్నారు. గత బీఆర్ఎస్ హయాంలో నాలుగు లక్షల చెక్కు ఏదైనా రిలీజ్ కావాలంటే పర్సంటేజ్ ఇస్తే తప్ప రిలీజ్ కాని పరిస్థితి ఉండేది. 10 సంవత్సరాల టిఆర్ఎస్ పాలనలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో ఓట్లు దండుకొని గద్దెనెక్కారే తప్ప మఖ్తల్ నియోజకవర్గంలో ఒక్క పేదోడికి కూడా డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. కానీ తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో పార్టీలకు అతీతంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు బాగులేకున్న రాష్ట్రంలో ఉన్న నిరుపేదలకు ఇండ్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో మఖ్తల్ నియోజకవర్గానికి ఇప్పటివరకు 5500 ఇండ్లు అంటే 275 కోట్ల విలువైన ఇండ్లు మంజూరు చేశామన్నారు. పేదోడికి ఇల్లు మంజూరు చేయడంలో ఇప్పటిదాకా 179 కోట్ల విలువైన ఇళ్లు ఇస్తున్నప్పటికీ, ఎవరి దగ్గర కూడా రూపాయి ఆశించకుండా మా పార్టీ కార్యకర్తలు,అధికారులు పని చేస్తున్నారు.

ఈరోజు తెలంగాణ రాష్ట్రంలోనే పేద ప్రజలు

26,000 కోట్ల రూపాయల విలువైనటువంటి ఇండ్లను కట్టుకుంటున్నారు. పేదోనికి సొంత ఇల్లు అనేది ఒక స్వప్నం పేదవాడు రోజంతా కష్టం చేసిన తర్వాత తన ఇంటికి వచ్చే ప్రశాంతంగా గడపాలని కోరుకునే ఎంతో మంది పేద ప్రజలు కలలు కన్నటువంటి సొంతింటి కల ప్రజా ప్రభుత్వం తీసుకు వచ్చిన ఇందిరమ్మ ఇళ్ల ద్వారా వారి సొంతింటి కల సాకారం అవుతుంటే ఆ పేదోళ్ల ముఖంలో ఆనందం చూస్తే నిజంగా చాలా సంతోషంగా ఉందని మంత్రి అన్నారు. మఖ్తల్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల పేరుమీద ఇండ్లు కట్టించిన తర్వాత లబ్ధిదారు కుటుంబాలకు బొట్టు పెట్టి బట్టలు చీర సారి లాగా ఇస్తా ఉంటే ఆ ఆనందానికి అవధులు లేవు, ఏది ఏమైనా మఖ్తల్ నియోజకవర్గ ప్రజలు తనకు ఇచ్చిన అవకాశాన్ని వారి నమ్మకానికి అనుగుణంగా మఖ్తల్ నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో మఖ్తల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఈడ్గి శ్రీనివాస్ గౌడ్,మున్సిపల్ చైర్మన్ వాకిటి మానస హనుమంతు,మున్సిపల్ కౌన్సిలర్లు,కాలనీ పెద్దలు,జుట్ల శంకర్,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.